జీవన ప్రవంతి

"...ఆ లూనా మీద వొస్తండు, సూడూ ... ఆడికి సెద్ద గోరోజినం వుందనుకో..." టూటవున్ రైటర్ కళ్లల్లో నిప్పులు గక్కుతూ, ప్రక్కనే వున్న హెడ్‌కి చూపేడు. ఆ హెడ్ ... లూనాని చూసేడు.

"...ఆడ్ని ఎక్కడో చూసినట్టుగుంది. ఎక్కడ చెప్మా...?" హెడ్ గోక్కున్నాడు, హెడ్ కానిస్టేబులు.

లూనా వచ్చేసింది. మున్సిపల్ గెస్ట్‌హౌస్ ముందరి గేటువద్ద ఎవరి ఆలనా, పాలనా లేకపోయినా బేఖాతరుగా పెరిగిన అశోకచెట్లలో ఒకదాన్ని ఎంచుకొని, దాని ముందు స్టేండ్ వేసాడు. డిక్కీలోంచి డైరీ తీసుకొని ... గెస్ట్ హౌస్ అంతటి వైపూ దృష్టి సారించేడు. అతనికి ... రైటర్ కన్పించేడు.

"...మున్సిపల్ గెస్ట్‌హౌస్ ముస్తాబయిన పెళ్లి పందిరిలా వుందండీ..." అన్నాడు, రైటర్‌తో. గెస్ట్‌హౌస్ ముందరి మైదానంలో పిచ్చిమొక్కలూ, గడ్డిదుబ్బులూ పీకేసారు. శుభ్రంజేసి రంగుల సున్నపు పొడితో బోర్డరు గీసేరు. గోడలు, అపుడే మేకప్ అద్దిన మొహాల్లా వున్నాయి. గెస్ట్‌హౌస్ పోర్టికోలో ... ఎపుడూ వెలగని గొట్టపుదీపం ఆ రోజు తెల్లగా వెలిగిపోతోంది. హాలులోకొస్తే – మున్సిపాల్టీ వాసన గాక, సెంటెడ్ ఫినాయిల్ వాసన! ఆశ్చర్యపోతూ, లూనా వ్యక్తి మళ్లీ –

"...మొత్తానికి మంత్రిగారి రాకతో గెస్ట్‌హౌస్‌కి ... పెళ్లిపందిరి డెకరేషనొచ్చింది..." అంటూ వరండాలో మిత్రులకోసం కళ్లతో వెదికాడు.

రైటరు కుడిచేతి ముడుకుతో హెడ్ కడుపు ఎడమ భాగంలో చిన్న స్ట్రోక్ ఇచ్చాడు చూసేవా? ఈడి గోరోజినం ... అన్నట్టు ఆ తర్వాత ఆ వ్యక్తివైపు చూస్తూ...

"ఇంకా నయం. ముస్తాబయిన పెళ్లిపందిరన్నావు. శోభనం గదన్లేదు..." అన్నాడు.

లూనా వ్యక్తి ఆ మాట వినలేదు... వరండా చివరివైపు నడిచేడు. హెడ్, కడుపు ఎడమ భాగం తడుముకుంటూ, "ఎవుడాడు?" అనడిగేడు.

"ప్రెస్, ప్రెస్సోడు! స్పెషల్ కరస్పాండెంటాట. అందికే, ఆ గోరోజినం..." జవాబిచ్చి, జేబులోంచి గోల్డ్‌ప్లాక్ ప్లెయిన్ సిగరెట్ పెట్టీ, అగ్గిపెట్టీ తీసేడు.

హెడ్ ... "ఓస్... ప్రెస్సా...!" అని, తేలిగ్గా నాలిక చప్పరించేసి చేయి చాచాడు సిగరెట్ కోసం. రైటర్ ... నాలుక్కరుచుకున్నాడు... సిగరెట్ పెట్టె తీసినందుకు...!

"పెట్టి మీద రెండు పడీసేరు మా ఊరిల! ఇక్కడో...?" సిగరెట్లపై పడిన ధరలను చెప్పాడు హెడ్.

"...ఇక్కడా? ఏమో...! పెంచే వుంటారు. నేను సిగరెట్లు కొన్నుగదా. పార్టీలొస్తే... పంపిస్తుంటాను" సిగరెట్టిస్తూ రైటర్.

ఆ సిగరెట్ అంటించి, పీల్చి, పొగ వదిలి...

"...పోలిటిక్స్‌లోకి క్రిమినల్స్ ఎలిపోవొస్తండ్రని గోలగోల చేస్తన్రుగాని వెల్ఫే రోళ్లు (సంక్షేమ పథకాల వాళ్ళు...) ఎలిపోవొస్తన్రని తెలుసుకోరు. అడ్డమయిన వెల్ఫేర్ ప్రోగ్రాంల కోసమే గదా... అడ్డదిడ్డంగా అన్నీటికి ధరలు పెంచేసేరు" అక్కసు వెళ్లగక్కేడు హెడ్. సిగరెట్ పొగ నోట్లోంచి ముక్కు రంధ్రాల్లోంచీ... నీళ్లను పీల్చి, వొదిలే నీటి ఏనుగులా వొదుల్తున్నాడు హెడ్.

"...ఈ ప్రెస్సు కొడుకులు ... ధరల మీద రాయరు..." మళ్ళీ ఆ లూనా వ్యక్తిమీదకే ఎక్కుబెట్టాడు రైటర్.

"ఆళ్లు రాస్తే ... తగ్గిపోతాయేటి? జనం, హరిగోస బెడితేనా... లేదు! మళ్లీ, ఆ జనాన్ని గోసబెట్టకండా మనమే లాఠీలూ, తుపాకులూ ఎత్తుతాం. మనం తగ్గించమని అడగాలేము అడిగేవోళ్లకి సపోర్టూ యివ్వలేం..." సిగరెట్ పీక విసిరేసాడు హెడ్?

కళ్ల మీదకి, స్కూటర్ హెడ్‌లైట్ పడింది. కళ్లకడ్డంగా చేయిపెట్టుకొని, నోటిలో బండబూతు పదం పెట్టుకొని–

"లైటార్పొచ్చు గదేటి..." కేకేసాడు హెడ్.

స్కూటర్‌వాలా, లైటార్పేసి, స్టేండ్ వేసి, వస్తూ...

"నమస్తే సార్... రైటర్‌గారు" అని రైటర్‌ని పలకరించి, ప్రక్కనున్న హెడ్‌వైపు ప్రశ్నార్థకంగా చూసి, ఓ చిర్నవ్వు విసిరేసి, లోనకి నడిచేడు.

"...ఎవుడీడు?" అడిగేడు హెడ్.

"...ఇలగుండాల ప్రెస్సోడంటే..." రైటర్ మెచ్చుకుంటూ!

హెడ్, కళ్ళలో స్కూటర్ లైట్ ఇంకా పోలేదు. కళ్లు పులుముకుంటూ...

"ఈడూ ప్రెస్సోడేనా? అందికేనన్నమాట... ఆ గోరోజినం..." అన్నాడు కోపంగా.

"..సె..సే... ఈడలాటోడు గాదు. మంచోడు. మనం చెప్పిందే రాసుకుంటాడు. మనకొక్కోసారి ఇన్ఫర్మేషనూ యిస్తుంటాడు. సరదాగా జర్నలిజం చేస్తండు. జరక్క గాదు. బోల్డు ఆస్తి వుంది. జంటిల్మేన్" కాండక్ట్ సర్టిఫికేట్ ఇచ్చేడు రైటర్.

ఇద్దరు పత్రికా ప్రతినిధుల కాండక్ట్ గురించీ, ఇద్దరు రక్షకభటులు ఆ విధంగా ముచ్చటించుకుంటుంటే - బంగ్లాలోంచి వారి ఇన్స్పెక్టర్‌లు బయటికి వచ్చేరు. ఇద్దరు రక్షకభటులూ లేచి నిల్చున్నారు. ఇన్స్పెక్టర్లిద్దరూ ... బులెట్ మోటార్లు తీసేరు.

"...పోలీసులంటే... యితని పాలేర్లనుకుంటండా?" ఒక ఇన్స్పెక్టర్ ప్రశ్నించి... బులెట్ స్టార్ట్ చేసాడు.

"...పాలేర్లయినా ఆ పని చెయ్యలేరు..." మరో ఇన్స్పెక్టర్.

ఇద్దరు రక్షకభటులూ ప్రశ్నార్థకంగా చూసేరు మంత్రిగారు రక్షణశాఖ వారికి ఏపని చెయ్యమన్నారా ... అని!

బులెట్ మోటార్లు ... పెద్దగా శబ్దం చేస్తూ, కదిలిపోయేయి.

* * *

బంగ్లాలో, పెద్ద హాలులో అనుచరుల మధ్య ఆసీనులై వున్నారు మంత్రిగారు. విలేకర్లు...కుర్చీల్లో సర్దుకు కూర్చున్నారు. మంత్రిగారి పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షులు విలేకరులకు, మంత్రిగారి పత్రికా ప్రకటన జిరాక్స్ కాపీ అందించేరు. ఆ నియోజకవర్గ ముఖ్యుల్లో ఒకాయిన ... అందంగా పార్సెల్ చేసిన పెద్ద పెద్ద ప్యాకెట్లు ... విలేకర్లకు అందించేరు.

మంత్రిగారు ఫోన్ అందుకొని ...

"ఆఁ... ఎస్. వస్తున్నాం. ఇపుడే ... ఓకే..." అని ఫోన్ పెట్టేసి ... లేచి నిల్చొని చేతులు జోడించేరు - శలవ్ తీసుకోండిక... అన్నట్లుగా.

లూనా విలేకరి ... ఇదేనా ప్రెస్‌మీట్ అని ఆశ్చర్యపోతున్నాడు. స్కూటర్ విలేకరి మంత్రిగారి ఫోటో ... తీస్తున్నాడు. మరో విలేకరి, పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షునికి సైగ చేస్తున్నాడు. మంత్రి ప్రక్క నిల్చోమని.

మంత్రిగారు బయటికి నడిచేరు. మందీ, మార్బలం, కదిలింది. వాహనాల కాన్వాయ్‌తో ... గెస్ట్‌హౌస్ మెరిసిపోయింది.

"...ఈ మాత్రం దానికే, ప్రెస్‌మీట్ అని రప్పించడమెందుకూ? ఇదేదో ఆఫీసుకే పంపించేస్తే ...చూసుకోమా...?" లూనా విలేకరి విసుగ్గా.

"...పత్రికా ప్రకటన వొక్కటే యిచ్చారేంటండీ? మరి, యిదో? ఇదే అసలుది..." చేతిలో ప్యాకెట్‌ని, చూపుతూ నవ్వేడు ఓ విలేకరి. లూనా విలేకరి అప్పుడు చూసుకున్నాడు ప్యాకెట్‌ని. పార్శెల్ బాంబ్‌లా అన్పించింది. పార్శెల్ అక్కడే వొదిలేసి, పత్రికా ప్రకటన తీసుకొని ... లూనా ఎక్కేడు.

ఆఫీసుకి చేరాక ... లూనా విలేకరి, టేబుల్ మీద ప్రకటన పెట్టేసి, కుర్చీలో కూర్చుని ... రింగవుతోన్న ఫోన్ అందుకున్నాడు.

"ఆఁ... ఆఁ... పంపిస్తాను. టి.పి. ఆపరేటర్‌కిస్తాను" ఫోన్ పెట్టేసి, మంత్రిగారి ప్రకటన అందుకున్నాడు.

"జనజీవన స్రవంతిలోకి రావాల్సిందిగా ... నక్సల్స్‌కు పిలుపు" శీర్షికతో ఎన్నికల వాగ్దానాలు నెరవేరుస్తామనీ, సారాపై నిషేధం కొనసాగిస్తామనీ, అభివృద్ధి కార్యక్రమాల అవసర రీత్యా ... అధిక ధరలు పెంచాల్సి వచ్చిందనీ... సమాజంలోని అన్ని వర్గాల ప్రజలూ ... దేశం కోసం త్యాగం చేయాలనీ... ఇలా సాగింది ప్రకటన.

సమాజంకి దూరంగా, అడవుల్లోంచి హింసచేసే నక్సల్స్ ... జనజీవన స్రవంతిలోకి వచ్చి, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చేరు.

విలేకరి, అంతా చదివి ... ఆలోచనలో పడ్డాడు. "అభివృద్ధి వెలుగునీడలు..." పుస్తకం గుర్తొచ్చింది. జనజీవన స్రవంతి పదం చూస్తే ... కాళోజీ ఉపన్యాసం గుర్తొచ్చింది. అంతలో, అర్జెంట్‌గా ...న్యూస్ పంపమన్న ఫోన్ కాల్ గుర్తొచ్చింది. కలం, కాగితం అందుకొని ... రాయబోతుంటే ...

"నమస్తే సార్..." ఎవరో ఆగంతకుడు.

"శ్రీనివాస్ గారంటే..." ప్రశ్నించేడు.

"నేనే..." జవాబిచ్చేడు విలేకరి.

సిగరెట్ పెట్టె ... అందించేడా వ్యక్తి. శ్రీనివాస్ ఆశ్చర్యంగా అందుకున్నాడు. ఖాళీ సిగరెట్ పెట్టె! విసుగ్గా దాన్ని విసిరేయబోతుంటో ... పెట్టెలోపలి భాగంలో రేపర్ మీద అక్షరాలు కన్పించేయి. ఆతృతగా చదివేడు.

"శ్రీనూ! నిన్న ఒక ఎప్పాయింట్‌మెంట్ వుంది. సంకేత స్థలానికి వెళ్లాను... అప్పటికే అక్కడ మాటుగాసేరు. నేను గ్రహించేలోగానే బందీనైనాను. నిన్నటి నుంచే..."

ఆ చుక్కలు, శ్రీనివాస్‌కి వెన్నెముకలో భయాన్ని కల్గించేయి. బాధగా మళ్లీ ఉత్తరంలోకి చూసేడు.

"...నా అరెస్ట్ పార్టీకీ, ప్రజలకీ తెలీదు. నా ప్రాణం కోసం కాకున్నా... మరిన్ని అరెస్టులు ఆపడానికి చూడాలి. అదృష్టవశాత్తూ, ఈ వ్యక్తి, స్టేషన్‌లో పోలీసులకి టీలూ, సిగరెట్లిస్తుంటాడు. నీ దగ్గరికి పంపించేను..." ఆ తర్వాత మరి అక్షరాలు లేవు. ఆ ఆగంతకుని కోసం చూస్తే అతనూ లేడు.

శ్రీనివాస్‌కి ఏం చేయాలో బోధపడలేదు. చంద్రాన్ని అరెస్టు చేసినట్లు పోలీసులు ఎందుకు ప్రకటించలేదు? ఈ ప్రశ్న శ్రీనివాస్ మనసులో ఆందోళనను కలిగింది.

వెంటనే, శ్రీనివాస్ ఫోన్ అందుకొని గెస్ట్‌హౌస్‌కి డయల్ చేసాడు. మంత్రిగారు – పేపర్ మిల్స్ ఎం.డీ.గారి విందుకి వెల్లి యింకా రాలేదట. ఎస్పీ ఆఫీస్‌కి ఫోన్ చేసాడు.

సరైన సమాచారం చెప్పలేదు. దొరగారు వొస్తేగానీ రిమాండ్ విషయం తెలీదట!

ఇక ఈ ప్రయత్నాలకంటే ముందు వార్త రాసి, టి.పి.కి అందించటం మంచిదన్న నిర్ణయానికొచ్చేడు.

శీర్షిక ఎలా పెట్టాలా అని గింజుకున్నాడు. ప్రముఖ తీవ్రవాది ... ఛఛ ... భయంకర బందిపోటు అన్నట్లుగా వుంది. కొట్టేసాడు. నక్సలైట్ చంద్రం ... ఇదీ ముద్దాయి తీరుగే వుంది. కొట్టేసాడు నక్సలైట్లే దేశభక్తులన్నాడు ఎన్టీఆర్...! “దేశభక్తుడు ... చంద్రం పోలీసుల చెరలో...” బాగుంది. కానీ, ఈ శీర్షిక ... ఎడిటర్ వుంచుతాడా?

చివరికి, మంత్రిగారి ప్రకటనకీ, చంద్రం అరెస్టుకీ ... ఎలాగో లింక్ చేసి, రెండు వార్తలూ ... ఒకే బాక్స్ ఐటమ్‌గా రాసేడు. అప్పుడు అనుమానం వచ్చింది – అరెస్ట్ వార్త రేపు పత్రికలో వచ్చేదాకా ... చంద్రం ప్రాణానికి హామీ ఏమిటి?

ప్రాణం... ఎంత విలువైనది .....

హైస్కూల్‌కి ఫర్లాంగు దూరంలో జంఝావతీ నది! మధ్యాహ్న భోజనాలు. నదివొడ్డున పణుకురాళ్ళ మీద కూర్చుని చేస్తుంటారు. కేరేజీలు శుభ్రంగా తోమి... నదివాలులో కడగటం...తీరని సరదా! చంద్రం...ఎంత బాగా...తోముతాడో కేరేజీని. తెల్లగా మెరుస్తుంది... వాడి కేరేజీ! ఓసారి శ్రీను అంతకంటే బాగా దోమి, కేరేజీ కప్పుల్ని ... నది వాలులో కడుగుతోంటే చేయిజారి ... కప్పు ప్రవాహంలో పడిపోయింది. జంఝావతీ నది ... నిండుగా వుంది. విపరీత వేగంతో ప్రవహిస్తోంది. పడిపోయిన కేరేజీ కప్పు కోసం ఆతృతగా కాళ్లుదించి, చేయి చాచాడు శ్రీను. కాళ్ళు జారి ప్రవాహంలోకి ... కొట్టుకుపోయేడు. శ్రీనుకి ఈతరాదు. ప్రాణభయంతో కేకలు...! రాతిమీద భోజనాలు చేస్తోన్న మిత్రులూ ... కేకలు వేస్తున్నారు గానీ ఎవ్వరూ సాహసం చేసి ... నదిలోకి దిగటం లేదు. చంద్రం మాత్రం గభాల్న దుమికేడు. అంగలు వేసి యీదుకొని శ్రీనుని చేరుకున్నాడు. నీటిలోంచి శ్రీనుని ... పైకి తేలించి, ప్రవాహంతోపాటుగా ... అలా ... అలా ... కొట్టుకుంటూ ... అవతలి ఒడ్డుకి చేరుకున్నాడు. ఒడ్డు చేరాక, గుండెలు కుదుటపడ్డాక, ఊపిరిదీసుకుని ... శ్రీనివాస్ చంద్రాన్ని చూస్తూ

“చంద్రం ... నీకు భయమెయ్యలేదా... నాకోసం నదిలో దిగటానికి?” అనడిగేడు.

“...భయం సాహసాలు చెయ్యనియ్యదు...!” చంద్రం జవాబు...!

మిత్రమా...! సాహసీ!

శ్రీనివాస్ కళ్ళు చెమర్చాయి...! కళ్ళు తుడుచుకొని, టి.పి. ఆపరేటర్ని పిల్చి రాసిన వార్తల్ని ఇచ్చేడు.

*   *   *

చంద్రశేఖరం, శ్రీనివాసూ బాల్యమిత్రులు. కలిసి హైస్కూల్ వరకూ చదువుకున్నారు. హైస్కూల్ తర్వాత శ్రీను కాలేజీకి ... చంద్రం పొలానికీ...!

చంద్రం తండ్రి ప్రమాదవశాత్తూ ఎడ్లబండి నుంచి ... కిందకు పడిపోయి కాళ్ళు విరిగిపోయేయి. తండ్రి మోసే బరువుని ... చంద్రం మోయవలసి వచ్చింది. చదువుకి స్వస్తి చెప్పాడు.

తలపాగా చుట్టుకొని సగర్వంగా తలెత్తుకు పచ్చని పంట పొలాన హాయిగా నవ్వే రైతు బొమ్మలను ... పుస్తకాలలో చూసిన చంద్రం ... దమ్ము మడి బురదలో జలగల్ని చూసేడు. చేనుతో పాటుగా ఎదిగొచ్చే ... గాబుని చూసేడు. ఎన్నుగింజను పట్టిదినే ... పేను పురుగుని చూసేడు. నాగేటి చాలులో ... తెగిన వానపాముల్ని చూసేడు. ఏడాది తిరిగే సరికి ... శిస్తు వసూలు జేసే కరణం నుండి, కాటా దీసుకు వచ్చే వ్యాపారి దాకా – పంట మీద కన్నేసే ఎన్నింటినో, ఎందరినో చూసేడు.

శ్రీనివాస్... సెలవులకి ఊరొచ్చినపుడల్లా...చంద్రంతో పొలంలోనే తిరుగాడుతాడు. దుక్కిదున్ని నొల్లదోలి, దమ్ముబట్టిన ఉడుపు మడిలో ... ఆకు కట్టల్ని వరుసల మీద వేస్తోన్న మిత్రుని జూస్తూ –

"చంద్రం...! ప్రకృతితో ఘర్షించీ, వొక్కోసారి దానితో చెలిమి జేసీ ... నువ్వు సేద్యం చేస్తున్నావు! నీ ఉత్పత్తికీ... ప్రకృతికీ మధ్య ఘర్షణా, ఐక్యతా కన్పిస్తోందిరా... నాకు..." అన్నాడు శ్రీను.

చంద్రం ... ఆ మాటకు సాలోచనగా మిత్రుని చూస్తూ –

"అది నిజమేనేమో గాని... ఉత్పత్తి వరకే అయితే... నువ్వు అన్నది కరెక్టే గాని... ఇంకా ఏదో గ్రహింపులోకి రానిది వుందిరా! ఈ ఉత్పత్తికీ ... నా బతుక్కీ ... మధ్య మరేదో వుంది. నాకు చెప్పటం రాకుంది గానీ... నేను గాదు, ఏ రైతూ... సుఖంగా లేడురా..." అన్నాడు.

✻ ✻ ✻

"సార్, మంత్రిగారి ప్రకటనకీ, నక్సలైట్ అరెస్టుకీ లింక్ జేసి రాసారేంటి? దేనికదే ... కొట్టేసేదా?" చేత్తో వ్రాతప్రతి పట్టుకువచ్చి, ప్రశ్నించేడు టి.పి. ఆపరేటర్.

"...దేనికది విడగొట్టి, దేనికిరా రాయటం?" కసురుకున్నాడు శ్రీను. టి.పి. ఆపరేటర్... గొణుక్కుంటూ వెళ్లిపోయేడు.

ఏదీ విడిగా, ఏదానితో సంబంధం లేకుండా లేదు. ఆ సంబంధాలు పరస్పర విరుద్ధ ప్రయోజనాల మధ్యనైతే ఘర్షణతోనూ, ఒకే ప్రయోజనమైతే ఐక్యతతోనూ ... వుంటాయంటాడు చంద్రం...! ఎంతగా ఎదిగిపోయేడు...

“కోలనీ బెనిఫిషరీస్ లిస్ట్‌లో పేర్లను కురిమినాయుడు మార్పులూ, చేర్పులూ చేస్తున్నాడు. మన జనాల పేర్లు కొన్ని తీసేసారట...” మండలాఫీసులో భోగట్టా జేసి తెలుసుకున్నాడు చంద్రం.

“...జాయింట్ కలెక్టర్ దగ్గరికి మళ్ళీ వెళ్లటమే. ఆయనకు మన వ్యవహారమంతా తెలుసుగనక, న్యాయం చేస్తాడు...” సలహా యిచ్చేడు శ్రీను.

శ్రీనివాస్ ... డిగ్రీ పూర్తిజేసే నాటికి చంద్రం భూమి కోల్పోయి, రిజర్వాయర్ ప్రాజెక్ట్ డిపార్టుమెంట్‌లో ... నాన్ మజ్దూర్‌గా మిగిలేడు.

ఆ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మించే నిమిత్తం – కొన్ని గ్రామాలూ, ఆ గ్రామాల వ్యవసాయ భూములూ ... ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. చంద్రం ... ఆ రకంగా భూమినీ, ఇంటినీ కోల్పోయేడు. నిర్వాసితులకు – ప్రభుత్వం – రిజర్వాయర్‌కి రెండున్నర కిలోమీటర్ల దూరంలో కోలనీ నిర్మాణం చేస్తోంది. రిజర్వాయర్ కోసం స్వాధీనం చేసుకున్న భూమికి ధర గూడా చెల్లించింది. కొంతమంది నిర్వాసితులకు ప్రోజెక్ట్ నిర్మాణంలో ఉద్యోగాలు కల్పించింది. రిజర్వాయర్ నిర్మాణ వ్యవహారంతో – గ్రామంలో చాలా మార్పులొచ్చేయి. ఎక్కువమంది భూముల అమ్మకమయ్యేక ... మరోచోట భూములు కొనుక్కోలేకపోయేరు.

చంద్రం అప్పులూ, సప్పులూ తీర్చేసి, చెల్లెలి పెళ్ళి జరిపించేడు. రైతు జీవితం నుండి – లేబర్ జీవితంలోకి వచ్చేడు.

భూముల విలువ లెక్కించి రైతులకు అందించే వ్యవహారంలో, అధికారులు చాలా తాత్సారం చేసారు. బడా నాయకులు పైరవీలు చేసారు. కురిమినాయుడు మండలాధ్యక్ష పదవీ అండతో ...ఈ వ్యవహారంలో చాలా పైరవీలు చేసాడు. రికార్డులు తారుమారయ్యేయి... నిర్వాసిత రైతుకి పరిహారం అందలేదు. చంద్రం... వీటన్నిటినీ జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిపించేడు. అందుకనే... శ్రీను కోలనీ సమస్యనూ అక్కడికే తీసుకెళ్ళమని సలహా యిచ్చేడు. రిజర్వాయర్ కారణంగా గ్రామంలో జరిగిన మార్పుల్లో భాగంగానే శ్రీనివాస్ కుటుంబం... దగ్గరిలోని బస్తీకి మారింది. శ్రీనివాసూ, చంద్రం... కలవటం తగ్గింది. ఎన్ని చలనాలు... చంద్రం జీవితంలో...

ఫోన్ రింగయ్యింది. శ్రీనివాస్ రిసీవర్ ఎత్తి ‘హలో’ అన్నాడు. అవతల నుంచీ అందిన వార్తతో శ్రీనివాస్ గుండెలు గబ గబా కొట్టుకున్నాయి.

“...నాకేం యిన్ఫర్మేషనివ్వలేదు. సరే... ఆఁహాఁ... అయితే, మీరు రండి, మీతోటేవొచ్చేస్తాను...” ఫోను పెట్టేసాడు.

మూర్తి చెప్పింది... ఎవరి గురించి...? చంద్రం గురించి కాదుగదా? చంద్రం...

"...ఈ నౌకరీ నాకిష్టంలేదురా. సూపర్‌వైజర్ ఇంటి చాకిరీ చేయడానికి, నాకు జీతమిస్తోంది... ప్రోజెక్ట్! రిజర్వాయర్ నిర్మాణంలో శ్రమిస్తే నా చెమట చుక్కలు ... ఈ రిజర్వాయర్లో వున్నాయిగదా అన్న సంతృప్తి అయినా వుంటుంది. ఛఛా ఈ కూరగాయలు తేవటం, కేరేజీలు అమర్చటం... నాకిష్టంలేదు..."

చంద్రం నాన్ మజ్దూర్‌గా చేసే పన్లు ఏమిటో వివరించేడు. శ్రీనివాస్... మిత్రునివైపు సానుభూతితో చూడటం తప్ప, ఇంకేమీ సహకరించలేకపోయేడు.

మరోసారి, శ్రీనివాస్ కలిసేసరికి చంద్రం రిజర్వాయర్ వద్ద కిల్లీ బడ్డీ ఓనర్‌గా కన్పించేడు.

"...ఆ సూపర్‌వైజర్‌గాడి ఇంటికి అడ్డమైన చాకిరీ చేసాను. ఇష్టంలేకపోయినా... సరిపెట్టుకున్నాను. గానీ, వాడు... రిజర్వాయర్‌కి వాడాల్సిన సిమెంట్ బస్తాల్ని... ప్రైవేట్ డీలర్ షాపుకి తరలించమన్నాడురా! ఎలా తరలిస్తాను...? ఆ రిజర్వాయర్... ఈ రోజు నన్ను భూమిలేని వాణ్ణిజేసినా, రేపు ఎందరో రైతుల భూములకు జలాధారం! అందరికి మోసం చెయ్యలేం గదరా? వ్యతిరేకించాను. పత్రికలవాళ్ళకి చెప్పాను. నాకు నౌకరీ పోయింది...వాడికి బదిలీ అయ్యింది. ఇదిగో ... ఈ అవతారమెత్తాను..." నవ్వుతూ, తేలిగ్గా చెప్పాడు ఉద్యోగం పోయిన విషయాన్ని ....

బయట, అదే పనిగా, స్కూటర్ హారన్ మ్రోగుతోంది. చంద్రం ఆలోచనల్లో వున్న శ్రీను తేరుకున్నాడు. సీట్లోంచి లేచి, వీధిలోకి చూసేడు. స్కూటర్ మీంచే, ఫోటోగ్రాఫర్ మూర్తి –

"... రండిసార్. మనదే ఆలస్యం. అంతా వెళ్లిపోయుంటారు..." పిలిచేడు.

శ్రీను, గబగబా వచ్చి స్కూటర్ వెనక సీట్లో కూర్చుంటూ –

"...ఎస్పీగారి వద్ద సరెండరవుతున్న నక్సలైట్ పేరుగానీ తెలుసా నీకు?" అనుమానంగా అడిగేడు మూర్తిని.

"...తెలీదుసార్, పోలీసులు చెప్పలేదు. మోస్ట్ వాంటెడ్ పర్సనట. లక్ష వుందట ... అతడి తలమీద రేటు! పోలీసులు... తెగ విసుక్కుంటున్నారు. లక్ష అతడికే వెళ్లిపోద్దట గదా? అదే, అరెస్టో... ఎన్‌కౌంటరో అయితే పోలీసులకి దక్కునని... గొణుగుడు..." స్కూటర్ రన్నింగ్‌లో మూర్తి మాటలు ... సరిగ్గా విన్పించటం లేదు... శ్రీనివాస్‌కి.

ఇంకేవో గుర్తొస్తున్నాయి...

"తలమీద రూపాయి పెట్టి వేలంవేస్తే అర్ధరూపాయికి చెల్లరు. మీకెందుకురా ... ఈ తిరుగుబాట్లు. అసలు, నువ్వు, ఆ చంద్రంతో కలవొద్దు. చెడిపోతావు. వాడెలాగూ చెడిపోయినట్లే. చదువూ సంధ్యా తగలడింది. వ్యవసాయంలో కెళ్లాడు. భూమి ఆనకట్టల

కల్సిపోయింది. నౌకరీలోకెళ్లాడు ఊడిపోయిందది. పోనీ, ఆ బడ్డీకొట్టు బెట్టాడు... బతకొచ్చుగదా...? ఊరూసులల్లా... ఆడికేల? నువ్విక అటు బంద్. మీ మామ ఏదో పత్రికాఫీసులో పనిచూసేడట... రేపే బయల్దేరు...” తండ్రి నిష్కర్షగా చేసిన హెచ్చరిక. శ్రీనివాస్... మహానగరం చేరిపోయేడు. మనసులో చంద్రం మాత్రం వీడిపోలేదు.

ఆనకట్ట దగ్గర బడ్డీకొట్టు చంద్రాన్ని ఎన్నాళ్లో ఆదుకోలేదు. రెండేళ్ళకు రిజర్వాయర్‌కు శాంక్షనయిన తొలివిడత నిధులు పూర్తిగా ఖర్చయిపోయేయి. రిజర్వాయర్... గర్భంలో రెండవ రీచ్ మట్టిపని మాత్రమే జరిగింది. మూడో ఏడాది విడుదలయిన నిధులు డిపార్టుమెంట్ మెయింటెనెన్స్‌కే చాలలేదు. తర్వాత యేడు... అదీ లేదు... పనులాగిపోయేయి. కాంట్రాక్ట్ కంపెనీలు కదిలిపోయేయి. డిపార్టుమెంట్ ఉద్యోగులు తప్ప.. జనం అలికిడి తగ్గిపోయింది. బడ్డీ కొట్టుమీద ఈగలు వాలటం ఆరంభించేయి. రిజర్వాయర్ నిర్మాణం ఎన్నికల హామీగా మిగిలింది.

“రిజర్వాయర్ పూర్తి కావాలని నినదిద్దాం, రిజర్వాయర్ పూర్తయ్యేదాకా బంజరుగా మిగిలిపోయిన భూములను... పేదలం సాగుచేస్తాం” అంటూ పిలుపిచ్చింది విప్లవపార్టీ. రైతాంగ పేదలంతా కదిలేరు. అప్పటికే, అనధికారికంగా భూమిని కురిమినాయుడు సాగుచేయటం ప్రారంభించేడు. కురిమినాయుడికీ, పేదలకీ ఘర్షణ జరిగింది. కురిమి నాయుడు అనధికారికంగా – సాగుజేస్తే – రాని పోలీసులు, పేదలు సాగుజేస్తే వచ్చేరు. రిజర్వాయర్ కోసం సేకరించిన ప్రభుత్వ భూమిని సాగుచేయడానికి వీల్లేదన్నారు. దాంతో, కురిమినాయుడు వెనక్కి వెళ్ళిపోయేడు. అతనికి బ్రతుక్కి ఢోకా లేదు గనుక గానీ పేదలు తగ్గలేదు. రిజర్వాయర్ నిర్మాణమన్నా సాగించి పనులు చూపండి. లేదా... అంతదాకా ఆ భూమిని సాగుజేసుకు బతకనీయండని ... ఆందోళన చేసారు. అరెస్టులు, లాకప్పులో చిత్రహింసలు, జామీనుపై విడుదలలు, మళ్ళీ ఆందోళన, అరెస్టులు ... చంద్రం... పూర్తికాల పార్టీ కార్యకర్త అయ్యేడు.........

స్కూటర్ ... పెద్ద గతుకులో పడి, కుదుపిచ్చి, ప్రక్కకు వొరిగింది. జాగ్రత్తగా బ్యాలన్స్ కీప్‌చేసి, బ్రేకువేసి నెమ్మది చేస్తూ –

“ఈ రోడ్‌కి బిల్స్ పేమెంటయి మూడు వారాలవలేదు! అసలిక్కడ రోడ్డు వేసాడా? చూడండి సార్... ఈ గోతులూ! దీనిమీద మంచి ఫోటో ఐటమ్ న్యూస్ రాయండి సార్...” అన్నాడు మూర్తి.

“ఎవరు దీని కాంట్రాక్టర్?”

“ఇంకెవరు? మున్సిపల్ ఛైర్మన్ తమ్ముడు.”

“అతనేదో జాబ్ చేసేవాడు?” శ్రీను అనుమానంతో.

"అదా? పోయింది లెండి. ఆఫీస్ సొమ్ము అత్తారిసొమ్ములా వాడేసేడట. ఇంటికి పంపించీసేరు. అయినా, అతనికేటంట లోటు? మీకు తెలన్దేటి? నూరుగురు తమ్ముల్ని పోషించీలేదండి... రారాజు! పదవి మహిమ అలాటిదీ..." మూర్తి, ఇలాంటి వ్యవహారాల బ్లూప్రింట్‌లు తీయగలడు.

"...మూర్తీ సరెండరవుతోన్న వ్యక్తిని చూసావేంటి?" శ్రీనుకి మరో ధ్యాస లేదు. చంద్రమే... కదుల్తున్నాడు హృదయంలో...!

"లేదుసార్. అసలు, నా వరకూ రాకపోను కబురు. రాజులు జవాను లేడా? అతగాడు మనకి ఫ్రెండు లెండి...! ఫోను గొట్టాడు... బాసూ, కొత్తగా కలర్ లేబ్ బెట్టాడు చూడూ, కుమార్ – మా రైటర్‌ని పట్టుకొని ఫోటోగ్రాఫర్ ఛాన్స్‌కి ట్రై జేస్తండు. నీకు ఎర్త్ యిచ్చీగల్దు... కాసుకో అని ఫోనుగొట్టేడు. ఏటి సెయ్యిడం? రైటర్‌కి... విలేకరి ప్రసాద్‌కీ దోస్తు. విలేకరి ప్రసాదుకి... పోలీస్ అఫీషియల్స్‌ల మంచి ఇన్‌ఫ్లూయన్స్! ఆఁ! మీకు లేదు. మీకు కొత్త! ... మీకు ఏటి తెల్దుగానీ... సార్... లాభంలేదు సార్ మీరు మారాల! ఎక్కడికక్కడ ... మీ గురిండే ... అందరూ డిస్కషన్స్! మీకు అఫీషియల్ సెక్షన్ల ... గుడ్ ఒపీనియన్ లేద్సార్. లాభంలే... తెల్సిపోయింది నాకు ... మీరు మారాల..."

ఎన్ని విషయాల్ని... కలిపి మాట్లాడతాడు మూర్తి! అదెలా సాధ్యమో? అతని కెమెరా లాగానే... దృశ్యంలో ఎన్నెన్ని బంధించబడతాయో... మూర్తి మాటల్లో గూడా...!

శ్రీనుకి మొదట్లో పట్నం వొచ్చినపుడు మూర్తితో పరిచయం ఆరంభమైంది. అప్పట్లో శ్రీను ఒక స్థానిక వార్తా పత్రికలో పని చేసేవాడు. ఆ పత్రిక ... కేవలం నిజాలు మాత్రమే ప్రచురించి నెలనెలా నష్టాల్ని మూటగట్టేది. రెండేళ్ళకి మూటగట్టిన నష్టాలకి – ప్రెస్ ప్రోపర్టీ చెల్లిపోగా పత్రిక ఆగిపోయింది. అపుడు, మూర్తి రికమెండేషన్ మీద ... అక్కడా, యిక్కడా కాన్వెంట్లల్లో పనిచేసాడు.

ఈ బ్రతుకు యాతనలో శ్రీను ... చంద్రంని ఒక్కసారే కలియగలిగేడు. అదీ, గాయాలతో, జిల్లా ఆసుపత్రిలో చంద్రం చికిత్స పొందుతున్న విషయం తెలిసినపుడు.

భూమి విషయంలో ఏర్పడ్డ వివాదం ... గ్రామకోలనీకీ, నిత్యజీవిత వ్యవహారాలకీ ప్రాకి కురిమినాయుడు... చంద్రం మీద కక్షగట్టేడు. చంద్రాన్ని చంపిస్తే మిగిలిన పేదలు బెదిరిపోయి, సంఘం చెదిరిపోద్దని... రౌడీల్ని నియోగించేడు. చంద్రం గాయాలతో... బ్రతికి, బట్టగట్టేడు. చంద్రంతో వున్న పైడయ్యి అనే రైతు చనిపోయేడు...

స్కూటర్ ఆగింది. ఎస్పీగారి బంగ్లా ... ఎత్తయిన అశోకా చెట్ల మధ్య వెలుగుతోన్న గాజు మందిరంలా వుంది. రెండంతస్తుల మందిరం! భవంతి ముందర... నాలుగైదు టూవీలర్స్, ఒక వైర్‌లెస్ సెట్ అమర్చిన జీపు, ఒక కారూ... వున్నాయి. ముఖద్వారం వద్ద యిద్దరు సాయుధ పోలీసులు నిల్చున్న రెండు అశోకా చెట్లలా వున్నారు.

మూర్తి స్కూటర్ డిక్కీలోంచి కెమేరా బ్యాగ్‌తీసి, భుజానికి తగిలించుకొని, బంగ్లా లోపలికి దారితీసేడు. వెనకే శ్రీను. అటునుంచి రైటరూ, హెడ్డూ వస్తూ ఎదురైనారు.

"...ఏంటంత గాభరా? ఏంలేదు. అంతా పూసిపోయింది..." అన్నాడు రైటర్! అది మూర్తికో...? శ్రీనుకో...?

"...సరెండరవుతున్నారని చెప్తే..." మూర్తి సంశయంగా...

"ఔనౌను. ఎస్పీగారే మీకు కబురు చెయ్యమన్నారు. మళ్లీ ఆయనే పది నిమిషాల కిందట ఎండీ గారింటినుంచి ... ఫోన్ జేసారు. ఇప్పుడు కాదనేసారు. వొచ్చిన విలేకర్లు... వెళ్ళిపోయేరు..." చెప్పాడు రైటర్ మీరూ వెళ్లిపోండి అన్నట్లుగా!

"ఇంతకీ ఎవరు సరెండరయ్యేది...?" శ్రీను ప్రశ్నించాడు.

"...నో న్యూస్..." ఇంగ్లీషు ఫోజు గొట్టేడు రైటర్.

"...నిన్న ఉదయం ... మీరు ... ఒకతన్ని అరెస్టు చేసారటగదా?" శ్రీను, ప్రశ్నించ కుండా వుండలేకపోయేడు.

"...ముద్దాయి అయితే, అరెస్ట్ చేసే వుంటాం..." ఘరానాగా జవాబిచ్చేడు రైటర్.

"అతను, నక్సలైట్..." శ్రీను పూర్తి చేయలేదు.

"...మరింకేం? పెద్దముద్దాయన్న మాట..." అని, పొట్ట కదిలినట్లు నవ్వేడు. ఆ తర్వాత, నడుము బెల్టు సర్దుకుని –

"...మీ పేరేంటీ... శ్రీనివాస్‌గదా? చూడండీ, కొశ్చినెయ్యకుండా మీరుండలేరు! కొశ్చినంటేనే... మా డిపార్టుమెంట్‌కి ఎగినిస్ట్. కొశ్చిన్ పేపరు లీకయితే మునిగే కొంపలు కంటే, మా ఆన్సర్‌లు లీక్ అయితే ఎక్కువ కొంపలు మునిగిపోతాయి. అందిసేత రేపటి వరకూ ... నో కొశ్చిన్స్ ... నో ఆన్సర్స్..." బూట్లు టక టక టక టక లాడించుకుంటూ వెళ్ళిపోయేడు రైటర్, హెడ్‌ని తీసుకొని!

శ్రీనుకి ఏంచేయడమో బోధపడలేదు. చుట్టూ చూసేడు... కాకీ దుస్తులూ, తుపాకీలూ... కాకీవనం!

"పదండిసార్. ఏదో ఛేంజ్ అయ్యింది ప్రోగ్రాం. కొంపదీసి, సరెండర్ డ్రామాని ఎన్‌కౌంటర్‌గా మార్చేయరు గదా రేపటికి?" మూర్తి ఆలోచనలు ... బ్లూప్రింట్ల దాకా పరుగెత్తాయి.

శ్రీను గుండెలు దడ దడా కొట్టుకున్నాయి. అప్రయత్నంగా... కళ్లవెంబడి నీళ్ళు...

"...ఏంటిసార్? ఏమైంది" గాభరాపడ్డాడు మూర్తి.

"మూర్తీ, ఒన్ టవున్ స్టేషన్‌కెళ్లి, లాకప్పులో ఎవరున్నారో గమనించి, రాగలవా...?" రుద్దకంఠంతో శ్రీను.

"ఎందుకు సార్?"

"చంద్రం కోసం...!"

"చంద్రమెవరు సార్...?"

శ్రీను ... ఎక్కడో వెదుకుతున్నాడు. బాల్యం నుండీ ప్రవహించిన స్నేహనది... కలిసి ఆడిన ఆటలు, కలబోసిన ఊసులు, కేరేజీ కడుగుతూ నదిలో మునక... చంద్రం సాహసించి... బ్రతుకు పోరులో ... తను ఓవైపు... శ్రీను ఏడ్పు అదుముకోలేక పోతున్నాడు.

మూర్తి, వెంటనే శ్రీను భుజాల మీదుగా చేయివేసి, ఓదార్చుతూ, బంగ్లా బయటకు తీసుకువచ్చి, స్కూటరు తీసేడు. తిన్నగా శ్రీనివాస్ ఆఫీసుకి చేరాక...

"...చెప్పండి సార్ ఎందుకు బాధపడ్తున్నారు? అసలేమైంది? చంద్రమెవరు...? నాకు చాతనయిన సాయం చేస్తాను. చెప్పండి..." ఓదార్పుగా అడిగేడు మూర్తి.

శ్రీనివాస్ ... వెక్కిళ్ళు ఆపుకున్నాడు. టేబుల్ సొరుగులోంచి, సిగరెట్ పెట్టె ... చీటీ తీసి, మూర్తికిచ్చేడు.

మూర్తి ... చీటీ చదువసాగేడు.

"... చంద్రం ... నా మిత్రుడు. నా ప్రాణరక్షకుడు. భూమి తగువుల్లో ... గాయాల నుండి తేరుకున్నాక ... మరోసారి రౌడీలు దాడిచేస్తే ... సంఘం వాళ్ళు ... ఒక రౌడీని చంపేసారు. అపుడు చంద్రాన్ని అరెస్టుజేసి ... లాకప్పులో పోలీసులు చంపేస్తారనీ... అజ్ఞాతంలోకి వెళ్లిపోయేడు. అప్పటి నుంచీ, నాకు అంతగా వాడి భోగట్టాలు తెలిసేవి కావు. అడవి భూముల పోరాటం, గిరిజన సంఘాల నిర్మాణం, గత ఉద్యమ అమరుల స్మారక స్థూప నిర్మాణం ... తదితర వార్తలు వినడమే! ఇదే వాడి ... చేవ్రాలుతో అందిన లేఖ..." శ్రీనివాస్ వివరించేడు.

"...నోడవుట్ సార్! ఇతని గురించే అయుంటాది. లక్ష పోతుందని వొకటే ఏడుపు. మినిస్టరేమో ... త్వరలో పార్లమెంటు ఎన్నికలున్నాయి. దెబ్బ గొడతాయని ... ఏడుపట! ఏదీ తేలకపోయి వుంటుంది... మనల్ని పొమ్మన్నారు..." చెప్పాడు మూర్తి.

"మరిపుడేంటి చెయ్యడం? జనజీవన స్రవంతిలోకి రమ్మని పెద్ద ప్రకటనిచ్చేడే మంత్రి?" క్రోధంగా ప్రశ్నించేడు శ్రీను.

"...ఏం జనజీవన స్రవంతండీ? సారాజులూ, రౌడీలూ, ఇసక కాంట్రాక్టులూ, టాక్స్ ఎగ్గొట్టే ఎం.డీ.లూ జనజీవన స్రవంతా? ఎవడి స్రవంతి ఆడిది...? జనంలోన... ఆళ్లున్నారా? ఈళ్లా...? పోలీస్ ప్రొటెక్షన్‌తోటి జనంలోకి ఎల్లే మంత్రులూ... జనజీవన స్రవంతి గురించి ప్రకటనలు..." మూర్తి మాటలకు అదుపు లేకుంటోంది.

ఇంతలో ఫోన్ మ్రోగింది. శ్రీను ... రిసీవర్ అందుకున్నాడు.

"...మండలాధ్యక్షుడు కురిమినాయుడు కిడ్నాప్... చంద్రం విడుదలకై డిమాండ్..." వార్త!

శ్రీనులో చలనమొచ్చింది. వాచీ చూసుకున్నాడు. "సక్సెస్ మూర్తీ..." అని కేకేసి టి.పి. దగ్గరకు వెళ్లాడు... కిడ్నాప్ వార్తను స్వహస్తాల్తో టైపు చేసేందుకు...! ★

యువత - సెప్టెంబర్, నవంబర్ 1996